క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు ముందుగా వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమగుండం వేసి ధుని పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ వ్యవహరించారు.

వైభవంగా పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ఎం.వెంకటేశ్వర్లు–నీరజ(వావిలేరు) దంపతులు వ్యవహరించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

రూ.12.60 లక్షల విలువైన మద్యం ధ్వంసం




మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

ఇందుకూరుపేట : వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ఇందుకూరుపేట సెబ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 95 కేసుల్లో 1,108 లీటర్ల లిక్కర్, 135 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.12.60 లక్షలు ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు మద్యాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ వివరించారు.

యుద్ధప్రాతిపదికన చర్యలకు సన్నద్ధం

• కమిషనర్ సూర్యతేజ



నెల్లూరు(బారకాసు): వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరద ప్రభావానికి లోనయ్యే వివిధ ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని మాగుంట లేఅవుట్, రామలింగాపురం, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జిలు, విజయమహల్ గేట్ సమీపంలోని బాక్స్ టైప్ బ్రిడ్జి పంప్‌హౌస్ తదితర ప్రాంతాలను శనివారం రాత్రి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన మార్గాలు, అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తోడేయాలని సూచించారు. ప్రజాజీవనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో పాలజ్వరం దూరం

• ఈ వ్యాధి వల్ల పాల దిగుబడికి గండి



పాలజ్వరం వ్యాధి సోకిన గేదె

తోటపల్లిగూడూరు : పశువుల్లో తరచూ వచ్చే వ్యాధి పాల జ్వరం. ఇది సోకడం వల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గి పాడి రైతులు నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ వ్యాధి ఆవులు, గేదెలు ఈనిన మొదటి వారంలో సోకే అవకాశం ఉంటుందని మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అధిక పాల ఉత్పత్తి ఉండే పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. పశువు ఈనిన వెంటనే పాలు పితకడం, కాల్షియం లోపం కారణంగా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి సోకితే పశువు తగిన మోతాదులో పాలు ఇవ్వక రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని ఆయన వెల్లడిస్తున్నారు.

వ్యాధిని ఇలా నివారించాలి

ఈనిన వెంటనే పశువు పొదుగును శుభ్రపరచాలి. పాడి పశువు నుంచి మొత్తం పాలను పిండకుండా కొంచెం ఉంచాలి. అలాగే పశువునకు కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలను తగిన మోతాదులో అందించడంతో పాటు కాల్షియం ఇంజెక్షన్లను వేయించాలి. ఈ చిన్నపాటి పద్ధతులు పాటిస్తే పాల జ్వరం నుంచి పశువులను కాపాడుకోవచ్చు.

వ్యాధి లక్షణాలు

పాలవ్యాధి సోకిన పశువుల్లో వ్యాధి లక్షణాలు మూడు దశల్లో ఉంటాయి. మొదటి దశలో మేత సరిగ్గా తీసుకోకపోవడం, నెమరు వేయకపోవడం, పళ్ల కొరుకుతూ బెదురు చూపులతో చికాకుగా ఉంటాయి. వణకుతూ కదలడానికి కూడా ఇబ్బంది పడతాయి. వ్యాధి ప్రారంభంలో శరీర ఉష్ణోగ్రత మామూలుగా ఉండి, ఆతర్వాత సాధారణ స్థాయి కంటే తగ్గి చల్లబడుతుంది.

• తర్వాతి దశలో పశువులు నిలబడలేకపోతాయి. శ్వాస, నాడి తగ్గి పశువులు కదలకుండా ఉండిపోతాయి. ఈ స్థితిలో పశువులు తలను పొట్టపై డొక్కలో ఆనించి ఎస్ ఆకారంలో మగతగా పడుకుని ఉంటాయి. వ్యాధి చివరిదశలో శ్వాస, నాడివేగం పడిపోతుంది. పశువు ఒకవైపు పడిపోవడం, తద్వారా కడుపు ఉబ్బరం లక్షణాలు కనిపిస్తాయి. కండరాల వణకుతో చలనం లేకుండా, అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. వైద్యం వెంటనే అందించకపోతే పశువులు చనిపోతాయి. వీటితో పాటు కంటి నుంచి నీరు కారడం, చెవులు వాలిపోతూ కనిపిస్తాయి. చూపు మందగించడం, చిరాకుగా ప్రవర్తించడం వంటి లక్షణాలు ఉంటాయి.

నష్టాలు వస్తున్నాయి



నాకు ఐదు గేదెలున్నాయి. గత నెలన్నరగా పాలిచ్చే రెండు గేదెలు నీరసంగా ఉంటున్నాయి. సక్రమంగా పాలివ్వడం లేదు. పశువైద్యులకు చూపిస్తే పాల జ్వరం వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. అధికారులు చెప్పినట్లుగా ఎన్ని మందులు వాడినా ఫలితం ఉండడం లేదు. దీనివల్ల పాల విక్రయాల్లో నష్టాలు వస్తున్నాయి.

– విజయసేనారెడ్డి, పాడి రైతు, పేడూరు

బ్రిడ్జి, అండర్‌పాస్‌ల నిర్మాణానికి పరిశీలన



రామన్నపాళెం రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం గురించి పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

కొడవలూరు : మండలంలో ఒక ఫ్లైఓవర్ బ్రిడ్జితో పాటు రెండు అండర్‌పాస్‌ల నిర్మాణానికి రైల్వే అధికారులు శనివారం పరిశీలించారు. కొడవలూరు రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్, నాయుడుపాళెం, రామన్నపాళెం రైల్వే గేట్‌ల వద్ద అండర్ పాస్‌లు నిర్మించాలని రైల్వే అధికారులు ప్రతిపాదించి ఉన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణాలకు ఏమైనా అడ్డంకులున్నాయా.. లేదా? అని రైల్వే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. కొడవలూరు రైల్వే గేటు వద్ద ఎనిమిదేళ్ల క్రితం ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదించారు. వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే రైల్వే అధికారుల పరిశీలన వల్ల వంతెన నిర్మాణంతో పాటు ఆవశ్యమైన నాయుడుపాళెం, రామన్నపాళెం అండర్‌పాస్‌ల కల సాకారమవుతుందన్న ఆశలు రేకెత్తాయి. రైల్వే అధికారుల వెంట తహసీల్దార్ కె.స్ఫూర్తి, డీటీ ముత్యాలమ్మ, ఆర్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు జి.రఘురామయ్య, భరత్‌లు ఉన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ప్రతిష్టాత్మక అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న సీఎస్సార్ హెడ్ ఆల్బర్ట్, కంపెనీ కార్యదర్శి రాజీవ్ రంజన్

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థ రెండు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కించుకున్నట్లు కంపెనీ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఇందులో భాగంగా సీఎస్సార్, సస్టైనబిలిటీ విభాగాల్లో ఉత్తమ ఆరోగ్య సంరక్షణ, వెల్ఫేర్ ప్రోగ్రామ్స్‌లో ఒకటి, బెస్ట్ ఎన్విరాన్‌మెంటల్లీ సస్టైనబుల్ ప్రోగ్రామ్‌లో మరో అవార్డును ఈ సంస్థ అందుకుంది. ఢిల్లీలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో కంపెనీ కార్యదర్శి రాజీవ్ రంజన్, సీఎస్సార్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్ పీటర్‌లు ఈ అవార్డులు అందుకున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా అందిస్తున్న అత్యుత్తమ సేవలకు ఈ అవార్డులు వరించినట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

రేబాలలో పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామంలో పలు పాఠశాలలను తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందికి సంబంధించిన హాజరు పట్టీని పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకులను సరిచూశారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, మెనూ, పాఠశాలలో పలు అంశాలపై విద్యార్థులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎల్.మస్తానయ్య, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘సాంప్’ పరీక్షలతో సామర్థ్యాల పెంపు



గుండాలమ్మపాళెం పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు : సాంప్(సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్) పరీక్షల ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు దోహదపడుతాయని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సాంప్–1 పరీక్షను ఎంఈఓ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పది తరగతుల విద్యార్థులకు సాంప్–1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఎస్సీఈఆర్టీ వారిచే తయారు చేసిన ప్రశ్నాపత్రాలతో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 1 నుంచి 8 తరగతుల విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌లో, 9, 10 తరగతుల విద్యార్థులు ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలతో పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. నిబంధనల మేరకే పరీక్షలు నిర్వహిస్తున్నారా.. విద్యార్థులు ఓఎంఆర్‌ను సక్రమంగా నింపుతున్నారా? అనే విషయాలను పరిశీలిస్తున్నట్లు వివరించారు.

గేదెను ఢీకొన్న ఆటో

• ఒకరికి గాయాలు

వెంకటాచలం : గేదెను ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. నిడిగుంటపాళెం వైపు నుంచి వెంకటాచలం వెళ్తున్న ఆటో సర్వేపల్లి సమీపంలో రోడ్డుపై గేదె అడ్డురావడంతో ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రశాంత్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రయాణికులు ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైపాడు వీఆర్వో సుబ్బయ్య మృతి

ఇందుకూరుపేట : అనారోగ్య కారణంగా మండలంలోని మైపాడు గ్రామ వీఆర్వో ఎస్.సుబ్బయ్య శనివారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల రెవెన్యూ అధికారులు సంతాపం తెలిపారు.

నిష్పక్షపాత విచారణకు వినతి

నెల్లూరు(క్రైమ్): పేదల ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నామమాత్ర విచారణ చేస్తున్నారని, నిష్పక్షపాతంగా జరపాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు కరెంటాఫీస్ సెంటర్‌లోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు.

గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వరూ..

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందించాలని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు కోరారు. ఈ మేరకు మంత్రి నారాయణకు వినతిపత్రాన్ని ఉత్సవ సమితి అధ్యక్షుడు సత్యనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కోశాధికారి మోహన్‌రావు, మండ్ల ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు శనివారం అందజేశారు.

కార్యాలయ ప్రారంభం నేడు

నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నామని నిర్వాహకులు తెలిపారు. సింగిల్ విండో అనుమతులకు సంబంధించిన దరఖాస్తులను ఇక్కడ స్వీకరించనున్నామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని దీనదయాళ్‌నగర్, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో మొక్కలను శనివారం నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. మొక్కలను ప్రతి ఒక్కరూ నాటి వాటిని సంరక్షించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, టీపీఆర్వో ప్రసాద్, ఉద్యానశాఖ ఏడీ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రితో భేటీ



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

మొక్కలు నాటుదాం.. సంరక్షిద్దాం

• ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి



పాతవంగల్లు మజరా వడ్డిపాళెంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

కొడవలూరు : మొక్కలను విరివిగా నాటడం ద్వారా పర్యావరణాన్ని సంరక్షిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి పిలుపునిచ్చారు. మండలంలోని పాతవంగల్లు వడ్డిపాళెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడంతో సరిపుచ్చుకోకుండా వాటిని పెంచాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. పచ్చదనం క్షీణిస్తే పర్యావరణం కలుషితమై మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందనే విషయం గుర్తించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ఒక్క మొక్కయినా నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సిరిమావిళ్ల రవిబాబు, నళిని, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.పద్మావతి, సహాయకురాలు సీహెచ్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



నిత్యాన్నదానికి విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో నిత్య అన్నదానానికి రూ.50,116లను శనివారం భక్తులు విరాళంగా అందజేశారు. నెల్లూరుకు చెందిన కొంజేటి వెంకట సత్యనారాయణ, లక్ష్మీకుమారి దంపతులు నిత్య అన్నదానానికి విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి దాతలకు శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన గృహోపకరణాలు

కోవూరు : మండలంలోని వేగూరుకండ్రిగ ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన ఘటన శనివారం ఉదయం జరిగింది. బాధితుడు అశోక్ కథనం మేరకు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉన్నట్లుండి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి అశోక్‌కు సమాచారం అందించారు. అతను వచ్చేలోగా ఇంట్లోని ఫర్నీచర్, టీవీ, ఫ్రిజ్, డబుల్ కాట్ మంచం తదితర గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. కోవూరు తహసీల్దార్ నిర్మలానంద బాబాకు సమాచారం అందించడంతో ఆయన సిబ్బందిని పంపి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

రామకృష్ణాచార్యులకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణాచార్యులు

ముత్తుకూరు : ముత్తుకూరుకు చెందిన సంస్కృత అధ్యాపకుడు నారాయణం ప్రసన్న రామకృష్ణాచార్యులకు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హోసూరులో ఉన్న ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు ఈ డాక్టరేట్‌ను శనివారం బహూకరించారు. సంస్కృత అధ్యాపకుడిగా, జ్యోతిష్య పండితుడిగా, జర్నలిస్టుగా చేసిన సేవలు, కృషిని గుర్తించి సంస్థ నిర్వాహకులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



గాయపడిన భార్గవ్



గాయపడిన మణి

మనుబోలు : బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మనుబోలు బైపాస్‌రోడ్డులోని వెంకటరమణ హోటల్ వద్ద శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. చెన్నూరు గ్రామానికి చెందిన కాకాణి మణి, గాడి భార్గవ్ బైక్‌పై గొలగమూడి వెళ్లి తలనీలాలు సమర్పించి దర్శనం చేసుకుని తిరిగి చెన్నూరుకు వస్తున్నారు. మనుబోలు బైపాస్‌లో బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంతెన నిర్మాణాలకు శంకుస్థాపన



వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న సోమిరెడ్డి

మనుబోలు : మండలంలోని యాచవరం, కట్టువపల్లి గ్రామాల్లో రూ.1.10 కోట్లతో నిర్మించనున్న రెండు వంతెనలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాచవరం–పిడూరు గ్రామాల మధ్య వంతెన పూర్తయితే రైతులకు కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. కట్టువపల్లిలో సప్లయ్ చానల్‌పై నిర్మించనున్న వంతెన సైతం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈ అనిల్‌కుమార్, కాంట్రాక్టర్ సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సింహపురి కూల్.. కూల్



గొడుగు సాయంతో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సింహపురిలో వాతావరణం కూల్.. కూల్‌గా శనివారం మారింది. చిరుజల్లులు ఉదయం నుంచి కురుస్తూనే ఉన్నాయి. కొంతకాలంగా ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు దీంతో ఉపశమనం పొందారు.

– నెల్లూరు(బారకాసు)



మినీబైపాస్ రోడ్డులో కురుస్తున్న వర్షం